క్లుప్తంగా

జగనన్నను మరోసారి సీఎం చేసుకుందాం



చిన్నపప్పూరులో ప్రచారం చేస్తున్న కేతిరెడ్డి సాయిప్రతాప్ రెడ్డి

పెద్దపప్పూరు: ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మరోసారి జగనన్నను సీఎంగా చేసుకుందామని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి సాయిప్రతాప్ రెడ్డి అన్నారు. బుధవారం చింతరపల్లి, చిన్నపప్పూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను వివరించారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేతిరెడ్డి పెద్దారెడ్డి, శంకరనారాయణను గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరామిరెడ్డి, సర్పంచు మాదినేని రమేష్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా పార్లమెంటు జనరల్ సెక్రటరీ రవిప్రసాద్ రెడ్డి, ఎంపీటీసీ అనీల్ కుమార్ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు హాజీవలి, స్థానిక నేతలు వెంకటరామిరెడ్డి, బాసూసాహెబ్, బిందెల భాస్కర్‌రెడ్డి, రాజారెడ్డి, సీనియర్ నాయకులు చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాతకోటలో ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ముస్లింలు

తాడిపత్రిరూరల్: పట్టణంలోని పాతకోటలో బుధవారం ముస్లింలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. నవరత్నాల ద్వారా జరుగుతున్న లబ్ధిని తెలియజేశారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే పెద్దారెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం



గుత్తి 18వ వార్డులో కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

గుత్తి: పట్టణంలోని 18వ వార్డు(జంగాల కాలనీ) బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శ్రీనివాసరెడ్డి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మంజునాథ్ రెడ్డి, పట్టణ కన్వీనర్ పీరా, కౌన్సిలర్లు అశ్వరాముడు, వాల్మీకి శివ, ఫరూక్, వరదరాజులు, కేవీ రమణ, నరేష్, వార్డు ఇన్‌చార్జ్‌లు అశ్వమారెన్న, అశ్వనాగప్ప, చిన్న మారెన్న, దస్తగిరి, అన్వర్ ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శంకరనారాయణ, వై.వెంకటరామిరెడ్డిని గెలిపించాలని కోరారు. జిల్లా నాయకులు మధుసూదన్ రెడ్డి, గురుప్రసాద్ యాదవ్, బేడల వెంకటరాముడు, కౌన్సిలర్ నజీర్, జిల్లా ఉపాధ్యక్షులు సీవీ రంగారెడ్డి, జిల్లా మైనార్టీ కార్యదర్శి కటిక ఖురేషి అన్వర్, నాయకులు షఫి, డిష్ అన్వర్, సీనియర్ నాయకులు రవూఫ్, రమేష్‌రెడ్డి, చెన్నాజీ, విశ్వనాథ్‌రెడ్డి, అబ్దుల్ పాల్గొన్నారు.

టౌన్‌బ్యాంకు ఉద్యోగి సస్పెన్షన్

తాడిపత్రిరూరల్: టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న తాడిపత్రి కో–ఆపరేటివ్ ఉద్యోగి రమేష్‌రెడ్డిని ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్ గార్గ్ సస్పెండ్ చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను తుంగలో తొక్కి టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నాడని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఇన్‌చార్జ్ కలెక్టర్ సదరు ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

100 మంది వలంటీర్లు రాజీనామా



రాజీనామా పత్రాలను ఎంపీడీఓ గోపీకృష్ణకు అందిస్తున్న వలంటీర్లు

పెద్దవడుగూరు: టీడీపీ అధినేత చంద్రబాబు మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ద్వారా ఫిర్యాదు చేయించి తమను ఎన్నికల విధులకు దూరం చేయడాన్ని నిరసిస్తూ బుధవారం మండలంలోని 100 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఈమేరకు రాజీనామా పత్రాలను ఎంపీడీఓ గోపీకృష్ణకు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలకు సేవలు అందిస్తున్న తమపై తప్పుడు ప్రచారం చేయడంతో పాటు ఎన్నికల ప్రచారం లో పాల్గొన కూడదని నిబంధనలు పెట్టడం సమంజసం కాదన్నారు. ప్రజలకు సేవలు చేస్తున్న తమపై తప్పులు వెతుకుతున్న టీడీపీ నాయకులకు తగిన గుణపాఠం చెబుతామన్నారు. తాడిపత్రిలో కేతిరెడ్డి పెద్దారెడ్డిని ఎమ్మెల్యే, వైఎస్ జగన్‌ను మరోసారి సీఎం చేసుకుంటామని ప్రకటించారు.

అవ్వాతాతలను ఏడి‘పింఛన్’

- చంద్రబాబు కుట్రలపై నిప్పులు చెరుగుతున్న పింఛన్‌దారులు
- సచివాలయాల వద్ద పడిగాపులు
- వలంటీర్ల ద్వారానే పంపిణీ చేయాలని డిమాండ్

గుంతకల్లుటౌన్: ప్రతి నెలా ఒకటో తేదీ పింఛన్ డబ్బులందించే వలంటీర్లపై చంద్రబాబు అండ్ బ్యాచ్ కక్ష గట్టి వారి సేవలను అడ్డుకున్న ఫలితంగా పట్టణంలో పింఛన్‌దారులు నరకయాతను అనుభవిస్తున్నారు. ఎవరిపైనా ఆధారపడకుండా సగర్వంగా బతికే దారిని చూపి సామాజిక భరోసా కల్పించిన సొమ్ము 3వ తేదీ వచ్చినా చేతికందలేదు. దీంతో ఈ నెల మందులు ఎలా కొనుక్కోవాలి? కనీస అవసరాలు ఎలా తీర్చుకోవాలని అవ్వాతాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 58 నెలల పాటు తమను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్న జగన్ ప్రభుత్వంపై ఉన్న అక్కసు, వలంటీర్లపై ఉన్న కడుపుమంటతో ‘చంద్ర’గ్రహణంలా దాపురించిన బాబూ అండ్ ఎల్లోబ్యాచే కారణమని తెలిసి పింఛనర్లు రగిలిపోతున్నారు. గుంతకల్లు మున్సిపాలిటీ పరిధిలోని 35 వార్డు సచివాలయాల పరిధిలో 12,484 పింఛనర్లు ఉన్నారు. నెలకు రూ.3.76 కోట్ల మేర పింఛన్ డబ్బు అందుతోంది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా వలంటీర్ల ద్వారా ఒకటో తేదీ ఉదయానికల్లా పెన్షనర్లకు సొమ్మును అందించేవాళ్లు. కానీ చంద్రబాబు అండ్ ఎల్లో బ్యాచ్ కుట్రల కారణంగా 3వ తేదీ అయినా తమకు పింఛన్ సొమ్ము అందలేదని, ప్రభుత్వం తమకు వలంటీర్ల ద్వారానే పింఛన్లను పంపిణీ చేయాలని అవ్వాతాతలు కోరుతున్నారు.



గుత్తి మండలం పి.ఎర్రగుడిలో వేచి ఉన్న పింఛన్ దారులు

వృద్ధులకు తప్పని అగచాట్లు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో పింఛన్ల కోసం బుధవారం వికలాంగులు, వృద్ధులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించారు. దీంతో లబ్ధిదారులు ఉదయం 6గంటలకే సచివాలయాల వద్దకు వెళ్లి పడిగాపులు కాచారు. సాయంత్రం 4.30 గంటలు అయినా పింఛన్ ఇవ్వలేదు. దీంతో పింఛన్ దారులు నానా అవస్థలు పడ్డారు. సీఎం వైఎస్ జగన్ చలువ వల్ల ఇన్నాళ్లు ఇళ్ల వద్దనే వలంటీర్లు పింఛన్ ఇచ్చేవారని, చంద్రబాబు కారణంగా పింఛన్ సొమ్ము కోసం ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబుకు ఎన్నికల్లో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

పింఛన్‌దారులకు తప్పని అవస్థలు

తాడిపత్రిరూరల్: టీడీపీ అధినేత చంద్రబాబు కుట్రతో తమకు కష్టాలు తప్పడం లేదని పింఛన్‌దారులు వాపోయారు. బుధవారం పట్టణంలో సచివాలయాల వద్ద పింఛన్ సొమ్ము కోసం పడిగాపులు కాశారు. పట్టణంలో 450 మంది వలంటీర్లు 10,077 మందికి పింఛన్‌సొమ్ము పంపిణీ చేసేవారు. అధికారులు సచివాలయాల వద్ద పంపిణీ చేయడంతో పింఛన్ సొమ్ము తీసుకునేందుకు లబ్ధిదారులు అష్టకష్టాలు పడ్డారు.

శింగనమలలో పింఛన్‌దారుల కష్టాలు....

శింగనమల: వలంటీర్లు పింఛన్ల పంపిణీ విధులకు దూరంకావడంతో పింఛన్‌దారులకు కష్టాలు తప్పడం లేదు. బుధవారం గ్రామ సచివాలయాల్లో పింఛన్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. శింగనమలలో ఒక కిలోమీటరు దూరంలో ఉన్న గ్రామ సచివాలయానికి వృద్ధులు, వికలాంగులు, ఉదయమే 8 గంటలకు అవస్థలు పడి చేరుకొని మధ్యాహ్నం వరకు పడిగాపులు కాశారు. శింగనమల సర్పంచ్ నాగమునెమ్మ షామియానా, కుర్చీలు వేసి, వచ్చిన వారికి చల్లని నీరు ఏర్పాటు చేశారు. ఈ పంచాయతీలోని గోవిందరాయునిపేట లబ్ధిదారులు 3 కిలోమీటర్లు దూరం నుంచి ఆటోల్లో వచ్చారు.

పుట్టు గుడ్డిని



పుట్టు గుడ్డి. ఎప్పుడో తల్లి దండ్రులు చనిపోయారు. ఒంటరిగా ఉంటున్నా. చుట్టుపక్కల వారిని అడిగి పనులు చేయించుకుంటున్నా. అడుగు తీసి అడుగు వేయాలంటే తోడుగా మనిషి ఉండాలి. ఇలాంటి పరిస్థితుల్లో సచివాలయానికి వెళ్లి ఎలా ఫించన్ తీసుకోవాలో అర్థం కావడం లేదు.

– నాగేశ్వరమ్మ, తాడిపత్రి

నిలబడలేను



నాకు 75 ఏళ్లు. వృద్ధాప్యంతో నిలబడలేని పరిస్థితి. సీఎం జగన్ పుణ్యానా ప్రతి నెల 1వ తారీఖునే వలంటీర్లు తలుపు తట్టి పింఛన్ డబ్బు ఇచ్చి వెళ్లేవారు. ఇప్పుడు సచివాలయం వెళ్లి పింఛన్ డబ్బు తీసుకోవడం మాలాంటి వృద్ధులకు చాలా ఇబ్బందిగా ఉంది.

–ఎస్ నారాయణస్వామి, గుప్తాకాలనీ, పామిడి

మమ్మల్ని కష్టపెడితే వచ్చే లాభమేంటో..



నా పేరు రజియాబేగం. నేను నిరుపేద వృద్ధురాలిని. జగన్ గవర్నమెంట్ ప్రతి నెలా ఒకటో తేదీ వ వలంటీర్ ద్వారా ఇంటికి వచ్చి పింఛన్ పంపించేది. ఆ వచ్చిన డబ్బుతో ఇంటి అద్దెను చెల్లించడంతో మందులు కొనుక్కేనేదానను. వలంటీర్లు మాకు పింఛన్ ఇవ్వకుండా చంద్రబాబు అడ్డుకున్నాడు. ఈ రోజు పింఛన్ తీసుకోవాలని పనిమానేసి సచివాలయం దగ్గరికి వచ్చి పడిగాపులు కాస్తున్నా. మమ్మల్ని ఇబ్బంది పెట్టడం వల్ల చంద్రబాబుకు వచ్చే లాభమేంటో అర్థం కావడం లేదు.

– రజియాబేగం, పింఛన్‌దారురాలు, హనుమేష్‌నగర్

ఎండలకు ఏమైనా అయితే బాధ్యత ఎవరిది?



చంద్రబాబు మనుషులు వలంటీర్లు పింఛన్ ఇవ్వకూడదని అడ్డుకోవడం మంచి పద్ధతి కాదు. రంజాన్ మాసం కావడంతో మేము ఉపవాసదీక్షల్లో ఉంటున్నాం. అసలే ఎండలు మండుతున్నాయి. పింఛన్ కోసం సచివాలయం వద్దకు వచ్చి ఉదయం నుంచి నేనే ఇబ్బందులు పడుతున్నాను. మండే ఎండల ధాటికి ముసలివాళ్లకు ఏమైనా జరిగితే బాధ్యత ఎవరిది? మళ్లీ వలంటీర్ ద్వారానే ఇంటికి పింఛన్ డబ్బు పంపించాలని వేడుకుంటున్నాను.

– ఎ.ఖానమ్, ఇరానీ కాలనీ, గుంతకల్లు

సచివాలయానికి ఎలా వెళ్లేది..



నా వయసు 72 ఏళ్లు. కంటిచూపు అంతంత మాత్రమే. కొద్దిరోజుల క్రితం ఆటో ఢీకొని కాలువిరిగింది. నెలరోజుల వరకు నడవలేని పరిస్థితి. మామాలుగా వలంటీర్ నిద్రలేవకముందే ఇంటివద్దకు వచ్చి పింఛను సొమ్ము ఇచ్చేవారు. ఇప్పుడు నేనే సచివాలయానికి ఎలా వెళ్లాలి? చంద్రబాబు, పవన్‌కళ్యాన్ వలంటీర్లపై కక్షగట్టి మా పండుటాకులకు కష్టాలు తెచ్చిపెట్టారు. మాలాంటి వారి ఉసురు ఊరికే పోదు.

– మొద్దెళ్ల సుంకమ్మ, పెద్దపప్పూరు

మంచి చేసిన ప్రభుత్వానికి మద్దుతు ఇవ్వండి



చాలవేములలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు

పుట్లూరు: అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని చేరువ చేసిన ప్రభుత్వానికి ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు కోరారు. బుధవారం ఆయన ‘మన ఊరికి మన వీరా’ కార్యక్రమంలో భాగంగా కందికాపుల, చింతకుంట, చాలవేముల, రంగరాజుకుంట, కుమ్మనమల, తురకవారిపల్లి, కొండుగారికుంట, రంగమనాయునిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామాల్లో ప్రజలు పూలమాలలు వేస్తూ స్వాగతం పలికారు ఆయా గ్రామాల్లో ఆయన ప్రతి ఇంటి వద్దకు వెళ్లి జగనన్న చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ప్రతి నెలా ఒకటవ తేదీన ఇంటి వద్దకు వలంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీ చేపడుతుండగా టీడీపీ నాయకులు కుట్రతో అడ్డుకున్నారని విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు మోసపూరిత హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన అనంతరం వాటిని విస్మరించడంతో పాటు జన్మభూమి కమిటీలతో ప్రజలను వేధింపులకు గురిచేసిందని గుర్తు చేశారు. మరోమారు మోసపూరిత మాటలతో ప్రలోభాలకు గురి చేయడానికి టీడీపీ నాయకులు వస్తున్నారని, వారి అబద్ధపు మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనతోపాటు ఎంపీ అభ్యర్థి శంకరనారాయణను గెలిపించాలని కోరారు. ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఎంపీపీ బి.రాఘవరెడ్డి, మండల కన్వీనర్ నాగేశ్వరరావు, నాయకులు మూలి వెంకటరామిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, కంచెం శ్రీనివాసులరెడ్డి, చింతకుంట మల్లికార్జున, రామాంజులరెడ్డి, మహేశ్వరరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కృష్ణవేణి, సాయినాథరెడ్డి, వెంకటరామిరెడ్డి, నాగేష్, బయన్న, మారుతి, నరేష్, నాగబూషణ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థి పల్లెనిద్ర

రంగనాయునిపల్లి ఎస్సీ కాలనీలో వైఎస్సార్‌సీపీ శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు అందించే ప్రభుత్వం రావాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించండి



దివ్యాంగుడిని ఓటు అడుగుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రిరూరల్: ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ప్రజలను కోరారు. పట్టణంలోని 31వ వార్డులో బుధవారం ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

యాడికి: నియోజకవర్గ ప్రజలందరికీ పార్టీలతో సంబంధం లేకుండా పరిపాలన అందించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని మరోసారి గెలిపించాలని ఆయన కుమారుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి ఓటర్లను కోరారు. బుధవారం కోనుప్పలపాడులో ఆయన ఇంటింటా ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేతిరెడ్డి పెద్దారెడ్డి, శంకరనారాయణను గెలిపించాలని కోరారు. జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, నాయకులు కోనా జగదీశ్వరరెడ్డి, కోనా వెంకటశివారెడ్డి, కోనా దేవనాథ రెడ్డి, రవికుమార్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, గంగిరెడ్డి, బాల గంగయ్య యాదవ్, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనను ఇంటింటా వివరించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

- రాజీనామా చేసిన వలంటీర్లతో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యాడికి: ఐదేళ్లగా అందించిన సంక్షేమ పాలనను ప్రజలకు వివరిస్తూ మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి రాజీనామా చేసిన వలంటీర్లకు సూచించారు. బుధవారం ఎమ్మెల్యే యాడికి వైఎస్సార్‌సీపీ కార్యాలయం, రాయలచెరువులోని శివాలయం వద్ద వారితో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తుండటంతో జీర్ణించుకోలేని టీడీపీ కూటమి ఎన్నికల కమిషన్ ద్వారా వలంటీర్లను విధులకు దూరమయ్యేటట్లు చేశారన్నారు. మీకు కేటాయించిన 50 ఇళ్ల పరిధిలో సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు ఫ్యాన్ గుర్తుకు ఓటేసేలా ప్రజల్లో చైతన్యం కల్పించాలన్నారు. వచ్చేది మనందరి ప్రభుత్వమనీ మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్లుగా చేస్తారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తెలిపారు.

బాధితుడికి ఆర్థిక సాయం

గత ఏడాది రోడ్డు ప్రమాదంలో కాలు, చెయ్యి పోగొట్టుకున్న రాయలచెరువు గ్రామానికి చెందిన శ్రీదేవి, చంద్రశేఖర్ దంపతుల కుమారుడు నవీన్‌కు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి రూ10 వేల ఆర్థిక సాయం చేశాడు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ శివప్రసాద్, నాయకులు తలారీ నాగేష్, దండు రాముడు, వాసు, సాంబశివుడు, వెంకటశివారెడ్డి, చలపతి రెడ్డి, రామాంజులరెడ్డి, లక్ష్మిరెడ్డి, వెంకటరామిరెడ్డి. శివశేఖరరెడ్డి, రామాంజనేయులు, కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘వారు నా గెలుపునకు పని చేయలేదు’

తాడిపత్రిరూరల్: ప్రస్తుతం పార్టీ మారుతున్న వారు, మారే ఆలోచనలో ఉన్న వారెవరూ గత ఎన్నికల్లో తన గెలుపు కోసం పని చేయలేదని ఎమ్మెల్యే పెద్దారెడ్డి తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది తమ పార్టీలోనే ఉంటూ గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కోసం పని చేశారన్నారు. పెద్దవడుగూరు మండలం రావులుడికి సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డిని అడిగితే టీడీపీ అభ్యర్థి కోసం పని చేయాలని ఎవరన్నారో చెబుతాడన్నారు. పెద్దపప్పూరు మండలం చిన్న ఎక్కలూరుకు చెందిన నరేంద్ర ప్రస్తుతం తమ పార్టీలో ఉన్నా ఎవరి బలవంతం మీద ప్రత్యర్థికి పనిచేశాడో వివరిస్తాడని తెలిపారు. ఇలాంటి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయన్నారు. అలాంటి వారి వల్ల పార్టీకి ఉపయోగం లేదన్నారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎంతమంది పార్టీ మారినా, వెన్నుపోట్లు పొడిచినా రాష్ట్రంతోపాటు తాడిపత్రిలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. చంద్రబాబు నిమ్మగడ్డ రమేష్ ద్వారా ఎన్నికల సంఘానికి ఇచ్చిన ఫిర్యాదు వల్ల వృద్ధులు, వికలాంగులు, మంచానికి పరిమితమైన వారు పింఛన్ అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థను రద్దు చేస్తారని, గతంలో మాదిరిగా ఎక్కడ పింఛన్ ఇస్తున్నారంటే అక్కడకు పరిగెత్తుకు వెళ్లి గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితులు వస్తాయన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటే మళ్లీ వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటింటికి పింఛన్ అందిస్తామన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గ్రహించాలని ఎమ్మెల్యే కోరారు.

డాక్టర్‌తోపాటు పలువురు వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే వైవీఆర్ సమక్షంలో పార్టీలో చేరిన డాక్టర్ శాంతి ప్రియ తదితరులు

గుత్తి: పట్టణంలోని శాంతిప్రియ ఆసుపత్రి నిర్వాహకురాలు, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ శాంతి ప్రియ, ఆసుపత్రి సిబ్బందితో పాటు పలువురు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. శాంతి ప్రియ ఆసుపత్రిలో జరిగిన ఓ కార్యక్రమంలో గుంతకల్లు ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి సమక్షంలో శాంతిప్రియతో పాటు పలువురు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారందరికీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంతి ప్రియ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరామన్నారు. గుంతకల్లు ఎమ్మెల్యేగా మరోసారి వై. వెంకటరామిరెడ్డి ని గెలిపించడానికి శాయ శక్తులా కృషి చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శ్రీనివాసరెడ్డి, పట్టణ కన్వీనర్ పీరా, పట్టణ సచివాలయ కన్వీనర్ రంగస్వామి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్య యాదవ్ , జిల్లా ఉపాధ్యక్షులు సీవీ రంగారెడ్డి, సీనియర్ నాయకులు షఫి,బేడల వెంకటరాముడు, చెన్నాజీ, కుమార్, వెల్డింగ్ రవూఫ్, జీపు రమణ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పింఛన్ పంపిణీపై కుట్రలు

యాడికి: వలంటీర్ల ద్వారా ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీ చేయకుండా చంద్రబాబు కుట్ర పన్నారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ జెడ్పీటీసీ వెంకటరామి రెడ్డి విమర్శించారు. బుధవారం రాయలచెరువులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్లుగా రాష్ట్రంలో ప్రతి పింఛన్‌దారుడు ప్రతి నెలా 1న ఇంటి వద్దనే పింఛన్ తీసుకునేవాడన్నారు. అయితే చంద్రబాబు పచ్చబ్యాచ్‌తో కలిసి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి 1వ తేదీన పింఛన్ రాకుండా చేశారన్నారు. సచివాలయాల వద్ద ఎండలో పింఛన్‌దారులు ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తలారీ నాగేష్, ఉపేంద్రగౌడ్, హనుమంతరెడ్డి, భాస్కర్‌రెడ్డి, దేవేంద్ర, లక్ష్మిరంగారెడ్డి, వెంకటనారాయణ రెడ్డి, జిలాన్, సుదర్శన్, సుదాకర్, తిరునాథ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కల్చరల్ డే

గుంతకల్లు: పట్టణంలోని బ్యాంకు కాలనీలోని భాష్యం హైస్కూల్‌లో బుధవారం కల్చరల్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గతేడాది టెన్త్‌లో 587 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచిన కె.యథీన్ అనే విద్యార్థిని వారి తల్లిదండ్రుల సమక్షంలో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా కాంపీటీటీవ్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినంది జ్ఞాపికలను అందజేశారు. భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణరావు, డైరెక్టర్ హనుమంతురావు, సీఈఓ అనిల్‌కుమార్, ప్రిన్సిపాల్ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

మానవతా విలువలు పెంపొందించుకోవాలి



రక్తదాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు, కళాశాల ప్రతినిదులు

బుక్కరాయసముద్రం: విద్యార్థులు మానవతా విలువలు పెంపొందించుకోవాలని మానవతా కన్వీనర్ తరిమెల అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. బుధవారం రోటరీపురం సమీపంలోని ఎస్ఆర్ఐటీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.బాలక్రిష్ణ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, టీపీఓ రంజిత్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓ పుల్లయ్య, మదుసూదన పాల్గొన్నారు.

నేడు ‘మన ఊరికి మన వీరా’

యల్లనూరు: వేములపల్లి నుంచి గురువారం మన ఊరికి మన వీరా కార్యక్రమం ప్రారంభమవుతుందని వేములపల్లి సర్పంచు అశోక్‌కుమార్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనరు మేడికుర్తి సర్పంచు ప్రభాకర్ రెడ్డి, తిరుమలాపురం సర్పంచు రామాంజులరెడ్డి తెలిపారు.

6లోపు పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలి

గుత్తి రూరల్: మండలంలోని అన్ని సచివాలయాలలో ఈ నెల 6లోపు పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులు ఆదేశించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సచివాలయ ఉద్యోగులతో ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగుల, మంచానికే పరిమితమైన వారికి వారి ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లను పంపిణీ చేయాలన్నారు. ఇతరులకు సచివాలయం వద్ద ఉదయం నుంచి పింఛన్లను పంపిణీ చేయాలన్నారు.

‘క్రైస్తవ సంఘాలతో ఆ వ్యక్తికి ఎలాంటి సంబంధం లేదు’

గుత్తి: పట్టణంలో గత శనివారం సీఎస్ఐ క్రైస్తవ సంఘాలన్నీ కలిసి రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించాయని, అయితే ఓ వ్యక్తి తాను కో–ఆర్డినేటర్ అని ప్రచారం చేసుకున్నాడని ఆ వ్యక్తికి తమతో సంబంధం లేదని క్రైస్తవ సంఘాల ఐక్య వేదిక సభ్యులు పేర్కొన్నారు. సీఎస్ఐ చర్చిలో మంగళవారం సీఎస్ఐ డివిజనల్ చైర్మన్ డేవిడ్ నాయక్, క్రైస్తవ సంఘాల కమిటీ సభ్యులు విజయశేఖర్, ప్రతాప్, సుందర్ పాల్, కెన్నెడి, ప్రకాష్ కుమార్, ప్రసాద్, సునీల్, అనిల్, పీజీ చంద్రసేన తదితరులు మాట్లాడారు. ఓ వ్యక్తి తన పబ్లిసిటీ కోసం తాను కో–ఆర్డినేటర్ అని ప్రచారం చేసుకుంటున్నాడన్నారు.

క్రైస్తవుల ప్రచారం

యాడికి: ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తాడిపత్రి ఎమ్మెల్యేగా కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఎంపీగా శంకరనారాయణను గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి జాన్సన్ ప్రజలను కోరారు. బుధవారం వీరన్నపల్లె, కమలపాడు, చింతలాయపల్లె గ్రామాల్లో క్రైస్తవ సోదరులతో కలిసి జాన్సన్ ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను పార్టీలు,మతాల కతీతం గా వలంటీర్ల ద్వారా అందించారన్నారు. కార్యక్రమంలో క్రైస్తవులు జోయల్ గణేష్, జాషువా, వినోద్, ప్రతాప్, నరేంద శ్రీరాములు, పక్కీరప్ప, హనూక్ కిట్టు, పోతురాయి, శేఖర్, యేసయ్య, సొలేమాను పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి: కేంద్రీయ విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరంలో 1వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ మల్కీసాబ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇక 3, 7 తరగతుల్లో మిగిలిపోయిన సీట్లకు ఈ నెల 10లోపు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కేంద్రీయ విద్యాలయం వెబ్ సైట్‌ను సందర్శించాలని సూచించారు.

పాలిటెక్నిక్‌కు ఉచిత శిక్షణ

గుంతకల్లుటౌన్: పాలిటెక్నిక్–2024 ప్రవేశపరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ శివకుమారి, పాలిసెట్ కోఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాలిసెట్ దరఖాస్తుకు ఈ నెల 5 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. వివరాలకు 7416545162, 9154733212 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.